
ఆంధ్రజ్యోతి
*** గరిష్ఠం 29.0 కనిష్ఠం 19.0
ANDHRAJYOTHY



నల్లగొండ
5
గురువారం 21 నవంబరు 2024



యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు
స్వామివారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్‌బాబు 7
వ్రత పూజల్లో పాల్గొన్న 618 జంటలు

నిరక్షరాస్యురాలైన వృద్ధురాలికి చెందిన కోట్ల రూపాయల ఆస్తిని కాజేసేందుకు రక్తసంబంధీకులే అడ్డదారిలో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడ్డారు. వృద్ధురాలికి చెందిన భూమిలో కొంతభాగమే కొనుగోలు చేసిన సదరు బంధువులు, మొత్తం భూమిని కాజేశారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే ఓ ఉద్యోగి ఈ మొత్తం వ్యవహారంలో చక్రంతిప్పగా, చివరికి వాస్తవం బోధపడి సదరు వృద్ధురాలు లబోదిబోమంటోంది. తనకు న్యాయం చేయాలని తిప్పర్తి పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. తాజాగా కలెక్టర్‌కు, నల్లగొండ డీఎస్పీకి కూడా వినతిపత్రం అందజేసింది. - (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

వృద్ధురాలిని మోసగించి రూ.2కోట్ల ఆస్తి కొట్టేసి

- 33గుంటలు కొనుగోలుచేసి 2.37ఎకరాలకు రిజిస్ట్రేషన్
- మోసాన్ని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసిన వృద్ధురాలు
- తహసీల్ ఆఫీస్‌లో హడావుడిగా రిజిస్ట్రేషన్ చేయించారు : బాధితురాలు



నల్లగొండ రూరల్ మండలం చిన్నసూరారం రెవెన్యూ పరిధిలో నకిరేకల్-నాగార్జునసాగర్ జాతీయ రహదారికి పక్కన కర్ర శ్రీరాములమ్మకు చెందిన భూమిని రక్తసంబంధీకుడు, వరుసకు సోదరుడయ్యే వ్యక్తి కొనుగోలు చేసినదానికంటే అదనంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. శ్రీరాములమ్మ 70 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులైన వృద్ధురాలు. ఆమె భర్త కొన్నేళ్ల క్రితమే చనిపోగా, ఏకైక కుమారుడు 2023లో అకాలమరణం చెందాడు. ఒంటరితనంతో బాధపడుతున్న వృద్ధురాలికి ఆసరాగా ఉండాల్సిన రక్తసంబంధీకులు ఆమె ఆస్తిని కాజేసేందుకు మోసానికి పాల్పడ్డారు. ఆమె వద్ద 33 గుంటల భూమిని కొనుగోలుచేసి ఆ మేరకు మాత్రమే డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ సమయంలో ఆమె పేరున ఉన్న 2.37 ఎకరాల భూమిని వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వృద్ధురాలు నిరక్షరాస్యులవడం, రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారి సైతం వివరాలను తెలపకపోగా, తొందరపెట్టి వేలిముద్రలు వేయించారు.

శ్రీరాములమ్మకు సూరారం రెవెన్యూ శివారులో సర్వే నెంబర్లు 638/1, 640/0, 641/అ, 641/ఆలో మొత్తం 2.37 ఎకరాల భూమి ఉంది. ఇటీవల నిర్మించిన నకిరేకల్-నాగార్జునసాగర్ జాతీయరహదారి-565 ఆమె భూమిలోంచి వెళ్తోంది. ఈ రహదారికి తూర్పు వైపున సర్వేనెంబర్ 638/1లోని 33 గుంటల భూమిని ఆమె బంధువు తల్లమల్ల హుస్సేన్ ఎకరాకు రూ.50లక్షల చొప్పున విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఈ ఏడాది జూలై 28న గ్రామపెద్దల సమక్షంలో అగ్రిమెంట్ చేసుకొని టోకెన్ అడ్వాన్స్‌గా రూ.1.50లక్షలు చెల్లించాడు. ఆగస్టు 23న మరో రూ.15లక్షల సొమ్ము చెల్లించాడు. అక్టోబరు 17న రిజిస్ట్రేషన్ సమయంలో సాయంత్రం 4.30గంటల ప్రాంతంలో హడావిడిగా రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లారని, ఆ రోజు బాధ్యతల్లో డిప్యూటీ తహసీల్దార్ వద్ద రిజిస్ట్రేషన్ చేయించారని వృద్ధురాలు తెలిపింది. ఆ సమయంలో రూ.21లక్షలు ఇచ్చారని, 33గుంటల విక్రయానికి సంబంధించి ఇంకా రావాల్సిన రూ.3.75లక్షలను భూమి కొలిచిన అనంతరం ఇస్తామని నమ్మబలికి హడావిడిగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపింది. తనకు చదువురాని విషయాన్ని ఆసరాచేసుకొని 33గుంటలకు బదులు తన మొత్తం భూమి 2.33ఎకరాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని శ్రీరాములమ్మ కన్నీటిపర్యంతమైంది. రిజిస్ట్రేషన్ సమయంలో తనతో డాక్యుమెంట్లతోపాటు మరో రెండు ఖాళీ స్టాంప్ పేపర్లపై సంతకాలు చేయించుకున్నారని వృద్ధురాలు తెలిపింది. అక్టోబరు 30న పాస్‌బుక్ వివరాలను సరిచేయించుకునేందుకు గ్రామస్థుల సహకారంతో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా మొత్తం భూమి హుస్సేన్ పేరున బదిలీ అయిన విషయం ఆమెకు తెలిసింది. ఒక్క రోజు తేడాతో మొత్తం భూమిని అతడు, కుమారులతో పాటు, మరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేశాడని ఈ నెల 4న తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

చీటింగ్ కేసు నమోదు

వృద్ధురాలి ఫిర్యాదుని మేరకు తిప్పర్తి ఎస్ఐ...

- మిగతా 8వ పేజీలో...



సాంబనే రారాజు

- మూడు దశాబ్దాలుగా సిరులు కురిపిస్తున్న వరి రకం
- వానాకాలంలో క్వింటాకు రూ.2,820 గిట్టుబాటు



మిర్యాలగూడ(వ్యవసాయం), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్ల క్రితం వర్షాధారంగా జొన్నలు, సజ్జలు వంటి పంటలు సాగయ్యేవి. ఆ తరువాత కాలంలో నీటిపారుదల వ్యవస్థ అభివృద్ధి చెందింది. బీడు భూముల్లో కృష్ణమ్మ అడుగుపెట్టింది. నాటి నుంచే వరి సాగు ప్రారంభమైంది. నాడు కొన్ని వరి రకాలు మాత్రమే ఉండేవి. అన్నీ దొడ్డు రకాలే. తెగుళ్లను ఏ మాత్రం తట్టుకునేవి కావు. దిగుబడులు కూడా బాగా తక్కువ. ఈ రకాల సాగు చేసినరైతులకు ప్రయోజనం అంతగా ఉండేది కాదు. అప్పుడు పుట్టుకొచ్చిందే సాంబ మసూరి (బీపీటీ-5204) రకం. ఆ రోజుల్లో ఇదో సంచలనం. నేటికీ ఈ రకం ధాన్యం హవానే ఉమ్మడి జిల్లాలో సాగుతోంది.

సాంబమసూరి రాకతో వరి సాగులో విప్లవం

వ్యవసాయ పరిశోధనల్లో 1980 ముందు వరకు పెద్దగా పురోగతి లేదు. దశాబ్ద కాలం నాటి సంప్రదాయ వరి వంగడాలనే రైతులు సాగు చేసేవారు. కాల పరిమితి కూడా ఎక్కువగా ఉండేది. గింజ బరువుకు పంట పడిపోవడం, ప్రకృతి వైపరీత్యాలకు పంట తట్టుకోలేకపోవడం, బియ్యం లావు కావడంతో తినడానికి కొంత ఇబ్బందిగా ఉండటంతోపాటు రైతులకు అంతగా ప్రయోజనం కూడా ఉండేది కాదు. హరిత విప్లవం తరువాత దేశ వ్యాప్తంగా హైబ్రిడ్ విత్తనాల రూపకల్పన ఊపందుకుంది. వరిలో విస్తృత పరిశోధనలు జరిగాయి. ఉమ్మడి రాష్ట్రంలోని గుంటూరు జిల్లా బాపట్లలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త ఎంవీ.రెడ్డి ఆధ్వర్యంలో వరి రకాలపై విస్తృత పరిశోధనలు జరిగాయి. చివరికి 1986లో బీపీటీ-5204 (సాంబమసూరి) వరి రకాన్ని శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. దీనికి బాపట్ల పేరు కలిసివచ్చేలా బీపీటీగా నామకరణం చేశారు.

రైతులకు సిరులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 12.68లక్షల ఎకరాలలో వరి పంట సాగు కాగా, అందులో ప్రైవేటు రకాలు 65శాతం, సాంబమసూరి 20శాతం, దొడ్డు రకాలు 15 శాతం ఉన్నాయి. సాగర్ ఆయకట్టు ప్రాంతంలో అత్యధికంగా ప్రైవేట్ రకాలు సాగయ్యాయి. ఈ రకాలకు తెగుళ్లు వ్యాపించడంతో పెట్టుబడులు పెరిగాయని, ఎకరానికి 30-35బస్తాలకు మించి దిగుబడి రాకపోవడంతో మిగులుబాటు లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ రకాల ధాన్యం అతి సన్నగా ఉండటంతో పంట నూర్పిడి కాగానే ధాన్యం ఆరబెడితే (17తేమ శాతం) ఎకరానికి 4-5 బస్తాలు తూకం తగ్గుతుంది. రైతులు పంట నూర్పిడి అనంతరం పచ్చి ధాన్యాన్ని (25-30శాతం) నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో...

- మిగతా 6వ పేజీలో...

సాంబమసూరి ప్రత్యేకతలివీ..

- జీఈబీ-24, టిన్-1, మసూరి వరి రకాల జన్యువులను సంకరం చేయడం ద్వారా సాంబమసూరి రకాన్ని శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు.
- సాంబమసూరి కాలపరిమితి 145-150 రోజులు.
- మధ్యస్థ సన్న ధాన్యం.
- ఎకరాకు దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
- కిలో ధాన్యానికి 675 గ్రాముల బియ్యం వస్తుంది.
- ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుంటుంది.
- తెగుళ్ల వ్యాప్తిని కూడా తట్టుకునేలా శాస్త్రవేత్తలు దీన్ని రూపొందించారు.
- బియ్యం రుచిగా కూడా ఉంటుంది.
- నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సాగుకు అనుకూలం.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఈ రకం వరి సాగవుతోంది.
- దేశ వ్యాప్తంగా 40లక్షల హెక్టార్లలో సాంబ సాగవుతోంది.

పైసలు ఇస్తేనే ఫైలు కదులుద్ది

- కాదు కూడదంటే నెలలతరబడి తిరగాల్సిందే
- రాజకీయ అండతో వసూళ్లు చేస్తున్న అధికారి
- నల్లగొండ మునిసిపాలిటీలోని ఓ అధికారి అవినీతి బాగోతం



వలస కార్మికులకు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలి



నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వలస కార్మికుల కోసం వచ్చే వారం నుంచి ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నకిరేకల్ ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆమె తనిఖీ చేశారు. అన్నివార్డులను సందర్శించి రికార్డులను, పరిశీలించారు. ప్రతిరోజు ఆసుపత్రికి వస్తున్న ఇన్‌పేషంట్ల సంఖ్య, ఔట్ పేషంట్లు, ఎమర్జెన్సీలో చేరుతున్న వారి సంఖ్య తదితర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి ఇతర ప్రాంతాల నుంచి వలస కార్మికులు వస్తున్నారని, వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారా, రిజిస్టర్ సక్రమంగా నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. లేబర్ రూమ్‌ను తనిఖీచేసి ప్రసవాల పరిస్థితిపై ఆరాతీసి ప్రసవం కంటే ముందు గర్భిణులకు ఇస్తున్న కౌన్సెలింగ్, సాధారణ ప్రసవాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించి, పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ జమీరుద్దీన్, ఆసుపత్రి వైద్యులు తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

గిరిజనుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈడీ రాజ్‌కుమార్, పలు శాఖల అధికారులు

తిరుమలగిరి(సాగర్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలుచేస్తోందని ఎస్టీ కార్పొరేషన్ ఈడీ రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని చింతలపాలెం, నెల్లికల్ గ్రామాల్లో నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడారు. తండాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, గృహ నిర్మాణం, వైద్యారోగ్య సౌకర్యాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పలు పథకాల గురించి గిరిజనులకు అవగాహన కల్పించారు. దర్తీఆబ అభియాన్ పథకం అమలు వివరించారు. పథకానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేశ్వర్, ఎంపీవో బిక్షంరాజు, ఎంఈవో శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



దీక్షలో మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్‌చైర్మన్ రాంబాబు

నల్లగొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలుచేయాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్‌చైర్మన్ అందె రాంబాబు డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు మూడో రోజు బుధవారం కొనసాగాయి. ప్రధానంగా దివ్యాంగుల పింఛన్ రూ.4వేల నుంచి రూ.6 వేలకు పెంచాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త వెంకన్న యాదవ్, సీనియర్ నాయకులు గుడ్డేటి సైదులు, శ్రీరాందాసు వెంకటాచారి, అహ్మద్ ఖాన్, శ్రీనివాస్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

ప్రజాపాలన కళాయాత్రను విజయవంతం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కళాయాత్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సాంస్కృతిక శాఖ కళాకారుల ద్వారా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రచారాన్ని కల్పించేందుకు నిర్వహిస్తున్న ప్రజాపాలన కళా యాత్రపై బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళాకారులు డిసెంబరు 7వరకు ప్రతీ రోజు రెండు మేజర్ గ్రామపంచాయతీలు,మండల కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం రెండు కళా బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌ను అధికారులకు ముందే పంపుతామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అ మిత్, డీపీఆర్‌వో వి.వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీవో మురళి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్

గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి కృషి

(ఆంధ్రజ్యోతి, నల్లగొండ): ప్రజలు, పాఠకుల అవసరాలకు అనుగుణంగా జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. బుధవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయ అభివృద్ధికి ప్రతీక్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

అనంతరం వారం రోజుల పాటు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ జెల్లా మార్కెండేయులు, గాదె వినోద్‌రెడ్డి, గోనారెడ్డి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బానోతు బాలమ్మ, నర్సింహారెడ్డి, నాగేశ్వర్‌రావు, వెంకట్రామ్‌రెడ్డి, కట్ట నాగయ్య, రాజేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమివేయాలి



మెడికల్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్ భూతాన్ని కళాశాలల నుంచి తరిమి వేయాలని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. ఎస్పీ శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాలలో బుధవారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ అనే విషసంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. తోటి విద్యార్థులతో సోదర భావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రొహిబిషన్ ర్యాగింగ్ యాక్ట్-1977 చట్ట ప్రకారం ర్యాగింగ్ పాల్పడి ఒకసారి కేసు నమోదైతే ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలే తప్ప, చెడు వైపు వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే పోలీస్‌స్టేషన్, డయల్ -100 ద్వారా సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాల్ రామచంద్రు, రాధాకృష్ణ, డాక్టర్ శివకుమార్, వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ ఎస్ఐ నాగరాజు, పోలీస్ కళాబృంద సభ్యులు పాల్గొన్నారు.

మూడేళ్లుగా ఎదురుచూపులు

- ఇంజనీరింగ్ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు బకాయి రూ.160కోట్లు
- టోకెన్ నెంబర్లు ఇచ్చినా ఏడాదిగా చెల్లింపులు లేవు 7



పేద విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించిన ప్రైవేట్ కళాశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 16 ప్రైవేట్ కళాశాలలు ఉండగా, సుమారు రూ.160కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు బకాయిలు చెల్లించేందుకు ఈ కళాశాలలకు ట్రెజరీల ద్వారా టోకెన్లు జారీ చేసింది. ఆ తరువాత కొత్త ప్రభుత్వం రావడంతో కళాశాలలకు చెల్లింపులు నిలిచాయి. దీంతో కళాశాల నిర్వహణ భారంగా మారిందని యజమాన్యాలు వాపోతున్నాయి. ● కోదాడ

మూడు ఎత్తిపోతల పథకాలకు

రూ.44కోట్లు

మంజూరు చేసిన ప్రభుత్వం

నల్లగొండ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యో తి): నల్లగొండ నియోజకవర్గంలో మూడు ఎత్తిపోతల పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరుచేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కనగల్ మండలం పొనుగోడులో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.6.83కోట్లు, నర్సింగ్‌భట్ల, దోమలపల్లి ఎత్తిపోతలకు రూ.16.95కోట్లు, నల్లగొండ మండలం కంచనపల్లి బక్కతాయ కుంట ఎత్తిపోతలకు రూ.20.22కోట్లు మంజూరు చేసింది. మొత్తం మూడు ఎత్తిపోతల పథకాలకు రూ.44.50కోట్లు మంజూరు కాగా, వీటి ద్వారా 4,231 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందనుంది. నల్లగొండ పట్టణం వీటీ.కాలనీలోని బక్కతాయికుంట చెరువును ఎస్ఎల్‌బీసీ హెచ్‌సీ కెనాల్ ద్వారా నీటిని నింపి గిరకబాయిగూడెం, మర్రిగూడెం రైతులకు సాగునీరు అందించనున్నారు. అంతేగాక వీటీ.కాలనీ, తిరుమలనగర్, రాక్‌హిల్స్ కాలనీ, హైదరాబాద్ రోడ్డు ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగనున్నాయి.

ఎరువుల ధర పెంపుపై పుకార్లు నమ్మొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : యాసంగి సీజన్‌లో డీఏపీ ధరలు పెరుగుతున్నాయన్న వార్తల్లో నిజం లేదని జిల్లా వ్యవసాయధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ రైతువేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఇన్‌పుట్ డీలర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఏపీ ధర బస్తాకు రూ.300 పెరగనున్నట్లు వస్తున్న వార్తల్లో నిజంలేదన్నారు. పాత ధరలోనే రూ.1,350కి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఎరువుల ధరలు పెంచి విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యాసంగి సీజన్‌కు జిల్లాలో యూరియా 26,700 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17,000 మెట్రిక్ టన్నులు, పొటాషియం 2,300, కాంప్లెక్స్ ఎరువులు 14000, సూపర్ 1700 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. డీఏపీ, యూరియా ధరల కంటే తక్కువకు లభ్యమయ్యే నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని డీలర్స్‌ను కోరారు. వానాకాలంలో 5.20 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని, యాసంగిలో మరో 20వేలు అదనంగా సాగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు విత్తనాలను, ఎరువులను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. మిల్లర్లు కొనుగోలు చేసే ధాన్యాన్నే రైతులు పండించేలా వారికి సూచించాలని కోరారు. కొన్ని రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులకు ఇబ్బందులు తలెత్తున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వాటిని సాగు చేయకుండా అవగాహన కల్పించాలన్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఏడుగురు డీలర్స్‌పై పీడీయాక్టు నమోదు చేయించామని, మరో ఆరుగురిపై కేసులు నమోదు చేయించామన్నారు. సమావేశంలో ఏడీఏ దేవ్‌సింగ్, ఏవోలు సైదానాయక్, ఉషారాణి, రుష్యేంద్రమణి, శివరాంకుమార్ పాల్గొన్నారు.

గతమెంతో ఘనం నేడు జీవనమే గగనం

వైభవం కోల్పోయిన ఇత్తడి వస్తువుల తయారీ కుటుంబాలు ▸▸ ఒకప్పుడు ఇంటిల్లిపాదీ ఇదే పనిలో నిమగ్నం ▸▸



చండూరుకు మారుపేరుగా నిలిచేవి ఇత్తడి వస్తువులు. అక్కడ తయారైన ఇత్తడి వస్తువులకు ఒకప్పుడు విపరీతమైన డిమాండ్ ఉండేది. వాటిని తయారు చేసేందుకు ఇక్కడ 200 కుటుంబాల వరకు ఉండేవి. ఇత్తడి వస్తువుల తయారు చేసే వారు తమ కు టుంబాలను ఎంతో దర్జాగా పోషించుకునే వారు. ఈ ప్రాంతంలో ఒకనాడు వైభవం పొందిన కంచరి వృత్తి క్రమంగా కనుమరుగవుతోంది. ఇత్తడికి ప్రత్యామ్నాయ వస్తువుల రాకతో ఉపాధి కరువై వృత్తికళాకారులు ఉపాధి కోసం వలస వెళ్తున్నారు. ఒకప్పుడు 200 కుటుంబాలు ఉన్న ఈ పట్టణంలో ప్రస్తుతం వారి సంఖ్య 10కి పడిపోయింది. ఒకప్పుడు ఖంగు మనే శబ్దాల తో మార్మోగిన ప్రాంతం నేడు నిశ్శబ్దం నెల కొంది.

(ఆంధ్రజ్యోతి-చండూరు)



ఒకప్పుడు చండూరు పేరు అంటేనే ఇత్తడి వస్తువుల తయారీకి ప్రఖ్యాతిగాంచిన ప్రాం తం. ఇక్కడ తయార య్యే ఇత్తడి వస్తువులనే పుత్తడి వస్తువులుగా భావించేవారు. అంతటి ఘనకీర్తి ఇక్కడి వృత్తికళాకారు ల సొంతం. వాటిని తయారు చేసే కళాకారుల కుటుంబాలు పుత్తడిలా వెలిగేవి. ఇప్పటికీ ఇత్తడి బిందెలను విక్రయించే సమయంలో చండూరు బిందెలని పేరు చెప్పి ప్రస్తావిస్తున్నారంటే చండూరు ఇత్తడి వస్తువులకు ఎంతటి పేరు ఉందో అర్థమవుతోంది. అంతటి ఇత్తడి వస్తువుల ప్రాముఖ్యం తగ్గడంతో కళాకారులకూ ఉపాధి కరువైంది. మార్కెట్ లో ప్రత్యామ్నాయ వస్తువులు రావడంతో గిరాకీ తగ్గిం ది. దీంతో వీటిని తయారీ చేసే కళాకారులు వృత్తిని వదిలి, ఇతర వృత్తిని వెతుక్కుం టూ వేరే ప్రాంతాల కు వలసలు వెళ్తున్నారు. ఒకప్పుడు 200కుటుంబాలు ఈ వృత్తి మీద ఆధారపడి ఉండేవి. నేడు కేవలం 10 కుటుంబాలే వృత్తిని కొనసాగిస్తున్నాయి.

మూడు రోజులు శ్రమిస్తే రూ.600

ఇత్తడి ముడిసరుకును హైదరాబాద్‌లోని బేగంబజార్ నుంచి తీసుకువస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.800 వరకు ఉంటుండగా చాలా వస్తువులు మూడు కిలోల వరకు ఉంటాయి. వీటి తయారీకి మూడు రోజులు పడుతుంది. ఆయా వస్తువులను రూ.3000లకు విక్రయించినా రూ.600లు మాత్రమే గిట్టుబాటు అవుతోంది. అయితే ఇత్తడి వస్తువులకు డిమాండ్ లేకపోవడంతో నిత్యం పని కూడా ఉండటం లేదు. దీంతో ఇంట్లో ఒక్కరే ఈ పని చేస్తూ మిగతా వారు ఉపాధి కోసం వేరే పనులకు వెళ్తున్నారు. ఒక రోజుకు రూ.200 కూడా గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. ఒకరు పనిచేస్తే పెట్టుబడి పోను నాడు నెలకు రూ.10 వేల వరకు గిట్టుబాటు అయ్యేంది. నేడు ఇద్దరు పనిచేసిన రూ.4 వేలు గిట్టుబాటు కావడం లేదు.

ఒకప్పుడు కళకళ..

చండూరులో చిన్న పాత్రల తయారీ మొదలుకుని పెద్దపెద్ద గంగాళాల వరకూ తయారు చేసేవారు. పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే రాత్రింబవళ్లు కష్టపడినా సమయం సరిపోయేది కాదు.పెళ్లిళ్లలో వధువుకు ఇత్తడి వస్తువులు కానుకగా ఇవ్వడం గొప్పగా భావించేవారు. తినే కంచం మొదలు మోసే బిందెలు, బకెట్లు అన్నీ ఇత్తడివే ఉండేవి. ధనవంతుల పెళ్లిళ్లకు పెద్దపెద్ద పాత్రలు తయారీ చేసి వాటిని కూడా కట్నంగా ఇచ్చేవారు. కట్నాల చదివింపులో కూడా ఇత్తడి వస్తువులనే ఇచ్చేవారు. బిందెలు, బకెట్లు, కంచాలు ఉండేవి. పూజా సామాగ్రి ఇత్తడివే పెట్టేందుకు ఆసక్తి చూపేవారు. దీంతో ఒకప్పుడు చండూరు మీదుగా వెళ్లే ప్రతీ బస్సుపై నా, బస్సులోనూ పెద్ద పెద్ద డాగులు, ఇతర ఇత్తడి వస్తువులతో నిండి ఉండేది. వీటిలో బస్సులో, బస్సుపైన తరలించేందుకు ఏడు, ఎనిమిది మంది కూలీలు ఉండేవారు. వీటికి ప్రాధాన్యం ఎప్పుడైతే తగ్గిపోయిందో చండూరులో బస్సు కూలీలు లేకుండాపోయారు. వారు కూడా ఇతర ఉపాధి మార్గాల వైపు మళ్లారు.

చవకగా లభిస్తుండడంతో ...

ఇత్తడి వస్తువులు చాలా ఖరీదైనవి. అయితే వీటికి ప్రత్యామ్నాయ వస్తువులు మార్కెట్‌లోకి రావడంతో కంచరి వృత్తి ఆదరణ కోల్పోవడం ప్రారంభమైంది. ఇంట్లో ఇత్తడి బిందెలకు బదులు స్టీలు బిందెలు, ప్లాస్టిక్ బకెట్లు మార్కెట్లోకి రావడం, అవి చవకగా, తరలించడానికి సులభంగా ఉండడంతో ప్రజలు మొగ్గుచూపడం మొదలుపెట్టారు. ఊరూరా టెంట్‌హౌస్‌లతో పెళ్లిళ్లకు అవసరమైన పెద్దపెద్ద పాత్రలు, గుండీల వాడకం తగ్గింది. దీంతో వృత్తి వారు ఎక్కడ జీవనాధారం దొరుకుతుందో అక్కడికి వలస వెళ్తున్నారు.

ముడిసరుకులు ప్రభుత్వమే అందించాలి



ఈ వృత్తికి తిరిగి ఆదరణ లభించాలంటే ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం. ప్రభుత్వం వృత్తిదారులకు నేరుగా ముడి సరుకులను సబ్సిడీపై అందించాలి. వస్తువు తయారీకి ప్రభుత్వ మే కూలీకి ధర నిర్ణయించాలి. మా వృత్తికి చేదోడు వాదోడుగా మా ఇంట్లో మహిళలు ఆసరా గా ఉండేవారు. పని లభించకపోవడంతో కిరాణ దుకాణాల్లో, వస్త్రాల దుకాణాల్లో జీతం చేస్తున్నారు.

-పెందోట బాలబ్రహ్మాచారి, కంచర వృత్తిదారుడు

బాధ్యత ప్రభుత్వానిదే



కులవృత్తులను కాపాడాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉంది. సమాజంలో కుల వృత్తుల వల్లే మంచి గుర్తింపు వస్తుంది. మేం తయారీ చేసిన వస్తువులకు ప్రభుత్వం మార్కెట్ సౌకర్యాన్ని కల్పించాలి. మేం నివసించడానికి సరైన ఇల్లూ లేదు. ప్రభుత్వాలు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఆదుకోవాలి.

- సంకోజు చంద్రశేఖర్, కంచర వృత్తిదారుడు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

రామగిరి, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నల్లగొండ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. మంగ ళవారం ఆ పాఠశాలలో వార్షిక ఆటల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ ప్రొఫెసర్ అంజిరెడ్డి, అధ్యాపకులు రవి కుమార్, ఉత్కర్ష్, సందీప్, నెహ్రూ, విద్యార్థులు ఉన్నారు.

అంతర్జాతీయ సైన్స్ ఉత్సవాలకు కట్టంగూరు వాసి



సైదులు (ఫైల్)

కట్టంగూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇండి యా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో భాగంగా ఈనెల 30 నుంచి డిసెంబరు 3 వరకు అస్సాంలోని గౌహతీ ఐఐటీలో నిర్వహించే సైన్స్ ఉత్సవాలకు కట్టంగూరుకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి సైదులు ఎంపికయ్యారు. ప్రస్తుతం సైదులు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

జాతీయ చిల్డ్రన్స్ ఉత్సవాల్లో నల్లగొండ విద్యార్థులు

నల్లగొండ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాలల ఉత్సవాలు న్యూ ఢిల్లీలోని నేషనల్ బాలభవన్‌లో బుధవారం నుంచి ఈ నెల 23 వరకు కొనసాగనున్నాయి. ఈ ఉత్సవాల్లో తొలిరోజు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బాలభవన్ కేంద్ర విద్యార్థినులు పాల్గొని ప్రదర్శన ఇచ్చినట్లు చెప్పారు. కేంద్రానికి చెందిన శివప్రియ, నిత్యశ్రీ, దీక్షిత, దివ్యశ్రీ పాల్గొని 'మహాగణపతిం మనసా స్మరామి' కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చినట్లు కేంద్ర పర్యవేక్షకుడు పాలబిందెల బాలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జాతీయ బాలభవన్ డైరెక్టర్ ముక్తఅగర్వాల్, ఉపడైరెక్టర్ ఆనంద్ ప్రకాష్ ప్రశంసా పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

నైపుణ్యం కలిగిన యువతకు అవకాశాలు

▸▸ ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యం, కలిగిన యువతకు అత్యుత్తమ అవకాశాలు లభిస్తాయని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీ యూలో బుధవారం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అంశాల సునిశిత పరిశీలన కలిగిన సవాళ్లను అవకాశాలుగా స్వీకరించే యువతకు అత్యుత్తమ అవకాశాలు ఎదురు చూస్తున్నాయన్నారు. ప్లేస్ మెంట్ సెల్ డైరెక్టర్ వై.ప్రశాంతి మాట్లాడుతూ ప్లేస్‌మెంట్ కార్యక్రమానికి 600మంది విద్యార్థులు హాజరయ్యారని, 250 మందికి ఉద్యోగాలు వస్తా యన్నారు. కార్యక్రమంలో సందీప్, హిమబిందు, చందర్‌తో పాటు 31 ఫార్మాసీ కంపెనీలు పాల్గొన్నాయి.

ఎంజీయూ డిగ్రీ పరీక్షలు వాయిదా

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ నేపథ్యంలో ఎంజీయూ పరిధిలో డిగ్రీ పరీక్షలను వాయిదా వేసినట్లు సీఈవోఈ డాక్టర్ ఉపేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21,23 తేదీల్లో నిర్వహించాల్సిన డిగ్రీ 3, 5వ పరీక్షలను డిసెంబర్7, 10వ తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : ఐద్వా

నల్లగొండ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళలక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ2,500 వెంటనే అందించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవనంలో బుధవారం నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గల్లి, గల్లీలో బెల్ట్ షాపులు ఏర్పాటు కావడంతో మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు రేషన్ కార్డులను వెంటనే జారీ చేయాలని కోరారు. లేని యెడల పెద్ద ఎత్తున మహిళలతో ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.. పల్లెబోయిన వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొండ అనురాధ, సరోజ, నాగమణి, అరుణకుమారి పాల్గొన్నారు.

ఇలా చేస్తే గణితం ఈజీ

10వ తరగతి విద్యార్థులకు పాఠం బోధించిన కలెక్టర్



విద్యార్థులకు గణితం బోధిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గణితంపై పట్టు సాధిస్తే జీవితంలో విజయం సాధించినట్లేనని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. నిత్యం జిల్లా పాలనలో మమేకమయ్యే కలెక్టర్ హనుమంతరావు తనకు ఇష్టమైన ఉపాధ్యాయుడి పాత్రను పోషించారు. బుధవారం భువనగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు 45 నిమిషాలపాటు గణితం బోధించారు. ఉస్మానియా యూనివర్సిటీలో గణితంలో పీజీ చేసి కొద్ది కాలం ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో గణితం లెక్చరర్‌గా విధులు నిర్వహించానని, గణితంలో పట్టు సాధిస్తే జీవితంలో విజయం సాధించినట్లేనని విద్యార్థులకు సూచించారు. బ్లాక్ బోర్డుపై చాక్‌పీస్‌తో లెక్కలు వేస్తూ విద్యార్థుల నుంచి సమాధానాలను రాబడుతూనే సూత్రాల ఆధారంగా లెక్కలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. నోట్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ గణితంపై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు, గణితంలో పట్టు సాధించే మెలకువలపై అవగాహన కల్పించారు. అలాగే మొదటి తరగతి నుంచే విద్యార్థుల్లో గణితం ఫోబియాను పోగొట్టేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నించాలని, 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఇందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపాలని ఆదేశించారు. జిల్లా విద్యా శాఖపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన బాల, బాలికల జట్లు

నాగార్జునసాగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నెట్‌బాల్ బాల, బాలికల జట్లను బుధవారం ఎంపిక చేసినట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో జరిగిన జట్ల ఎంపికకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన 150 మంది క్రీడాకారులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. అండర్-14 విభాగంలో బాలికల జట్టుకు 12 మందిని, బాలుర జట్టుకు 12 మందిని, అండర్-17 విభాగంలో 12 మంది బాలురను, 12 మంది బాలికలు ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ విమల, మిర్యాలగూడ సెక్రటరీ వెంకట్రామిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ లలిత, పీఈటీలు పాల్గొన్నారు.

హన్యానాయక్‌కు గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన సోషల్ వర్కర్ ధీరావత్ హన్యానాయక్ అంతర్జాతీయ గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఫెయిత్ బంజారా అనాథాశ్రమాన్ని స్థాపించి పట్టణ, పరిసర ప్రాంత నిరాశ్రయులు, దివ్యాంగులకు సహాయ, సహకారాలు అందిస్తున్నారు. దీంతో విద్య, వైద్య, సామాజికరంగాల్లో హన్యానాయక్ చేస్తున్న సేవలను గుర్తించిన బిజినెస్ గుడ్‌విల్ అంతర్జాతీయ సంస్థ హన్యానాయక్‌ను అవార్డుకు ఎంపిక చేసింది. సోమవారం బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో దేశ, విదేశీ ప్రముఖులు అవార్డు అందజేసినట్లు హన్యానాయక్ తెలిపారు. అంతర్జాతీయ అవార్డు అందుకున్న హన్యానాయక్‌కు స్వచ్ఛంద సంస్థల సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

సాంబనే రారాజు

(5పేజీ తరువాయి)

ఈ ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ దక్కకపోవడంతో క్వింటాకు రూ.2,320లు మాత్రమే ధర లభిస్తోంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాంబమసూరి సమృద్ధిగా పండింది. తెగుళ్ల వ్యాప్తి లేదు. పెట్టుబడులు బాగా తగ్గాయి. ఎకరానికి 45-50బస్తాలు (31.5-35క్వింటాళ్లు) వరకు దిగుబడులు వచ్చాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాంబమసూరి వరి ఆరబెట్టే రకం కావడంతో ధాన్యం అంతా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. క్వింటాకు మద్దతు ధర రూ.2,320తోపాటు ప్రభుత్వం ఇచ్చేరూ.500 బోనస్ వస్తోంది. అంటే క్వింటా ధాన్యానికి రూ.2,820ల వరకు ధర వచ్చినట్టు లెక్క. ఎకరానికి 45-50 బస్తాలు దిగుబడికి రూ.88, 830 నుంచి రూ.98,700 వరకు ఆదాయం వస్తోంది. ఈ వానాకాలం సీజన్‌లో సాంబమసూరి సాగుచేసిన రైతులు గణనీయమైన ఆదాయం గడించారు.

వానాకాలం అంటే బీపీటీ

సాంబమసూరి వరి రకం రూపకల్పన జరిగి ఇప్పటికి 38 ఏళ్లు. నాటి నుంచి సాగర్ ఆయకట్టుతో పాటు వివిధ ప్రాజెక్టు ల కింద వానాకాలంలో సాంబమసూరి రకం మాత్రమే సాగు జరిగేది. ఈ పంట సాగు చేసిన రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. దశాబ్దాలుగా ఈ రకానికి తిరుగు లేకుండా పోయింది. ప్రభుత్వ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఎన్ని ఉన్నా, ఇప్పటి వరకు సాంబమసూరి రకానికి ప్రత్యామ్నాయ వంగడాన్ని రూపకల్పన చేయలేకపోయారు. మూడు దశాబ్దాలుగా వందలాది రకాలు విడుదల చేసినా, ఏవీ కూడా ఇంత లా మార్కెట్‌లో ప్రాచుర్యం పొందలేకపోయాయి. ఈ మధ్య కాలంలో హెచ్‌ఎంటీ, చింట్లు వంటి ప్రైవేట్ రకాలు మార్కెట్లో ప్రవేశించి లక్షలాది ఎకరాల్లో సాగవుతున్నాయి. ఈ దశలోనూ సాంబమసూరి రకాన్ని రైతులు సాగు చేస్తూనే ఉన్నారు.

సాంబమసూరి సాగుతో మంచి ఆదాయం

ప్రతి వానాకాలంలో సాంబమసూరిని రకం వరిని సాగు చేస్తున్నా. ఈ రకానికి తెగుళ్ల వ్యాప్తి, పెట్టుబడి బాగా తక్కువగా ఉంటోంది. ప్రస్తుతం ఆరు ఎకరాల్లో సాగు చేయగా ఎకరానికి 45-50 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించా. మద్దతు ధరతో పాటు బోనస్ వస్తుండటంతో మంచి ఆదాయం వస్తోంది. ప్రైవేట్ రకాలకంటే సాంబమసూరి సాగు చేసిన రైతులు చాలా ఆనందంగా ఉన్నారు.

-అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, రైతు, త్రిపురారం

గురుకులం.. సమస్యలకు నిలయం

- ▸▸ అధ్వానంగా బొప్పారం బీసీ బాలుర గురుకుల పాఠశాల
- ▸▸ 280 మంది విద్యార్థులకు 10 గదులు
- ▸▸ తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ఇరుకు గదిలో పాఠశాల విద్యార్థులు(ఫైల్)

కేతేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం బొప్పారం గ్రామ పరిధిలో గల బీసీ బాలుర గురుకుల పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. చాలీచాలని గదుల్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. పాఠశాలకు పక్కా భవనం లేదు. 2007లో మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన భవనం నిరుపయోగంగా ఉండడంతో తాత్కాలికంగా మూడు రేకులషెడ్లు వేసి పాఠశాలను, వసతిగృహాన్ని ప్రారంభించారు.అయితే ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రజాప్రతినిధుల సహకారంతో మూడు షెడ్లు ఏర్పాటు చేసి పాఠశాలను అందులోనే కొనసాగిస్తున్నారు. పాఠశాలలో 5నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు సుమారు 280మంది ఉన్నారు. ఈ భవనంలో 10 గదులు ఉండగా వీటిలో 8గదులుల్లో విద్యార్థుల బోధన కొనసాగుతోంది.ఒకటి స్టోర్‌స్టాఫ్ రూమ్‌లుగా వినియోగిస్తున్నారు.

విష సర్పాల సంచారం

ఇరుకు గదులతో సరిపోకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఒక్కో గదిలో 25 మందికి పైగా నిద్రిస్తున్నారు.అంతేకాకుండా డ్రైనేజీ, మురుగు దొడ్లు లేకపోవడంతో పాఠశాల ఆవరణంలోనే మురుగు నీరు చేరుతోంది. ఈ క్రమంలో పాఠశాల ఆవరణంలో చెత్తా చెదారం, గడ్డి, పిచ్చిమొక్కలు పెరుగడంతో అధ్వానంగా తయా రైంది. పాఠశాల మూసీ ప్రాజెక్టుకు సమీపంలో ఉండడంతో ప్రహరీ లేకపోవడంతో నిత్యం విష సర్పాలు సంచరి స్తున్నాయి.

కొత్త భవనం నిర్మాణం పూర్తి ఎప్పటికో..?

బీసీ బాలుర గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మాణం కోసం నీటి పారుదల శాఖ అధీనంలో 10 ఎకరాల భూమిని పాఠశాలకు కేటాయించారు. ఆ స్థలంలో భవనం నిర్మాణానికి రూ.19 కోట్లు మంజూరు కావడంతో 2017 సంవత్సరంలో శంకుస్థాపన చేశారు. ఆ భవన నిర్మాణ పనులు నిధులు తదితర కారణాలతో అసంపూర్తిగా నిలిచిపోయింది. భవనంలో 70 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంకా ఫ్లోరింగ్, ఎలక్ట్రీసిటీ, ప్లబింగ్ పను పూర్తి చేయాల్సి ఉంది. భవనం నిర్మాణం త్వరగా పూర్తి తమ ఇబ్బందులు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.



పాఠశాల ఇంత దారుణంగా ఉంటే ఏం చేస్తున్నారు

▸▸ *పాఠశాల ప్రిన్సిపాల్, ఎంపీడీవోను ప్రశ్నించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి*



మూసీ పాఠశాల పరిసరాల్లో మురుగును పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం, గడ్డి, చెట్లు, అపరిశుభ్రతతో ఇంత దారుణంగా ఉంటే ఏం చేస్తున్నారంటూ నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బొప్పారం గ్రామపరిధిలోని బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ధనమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావును ప్రశ్నించారు. గురుకుల పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి బద్దం గణేష్ మంగళవారం సాయంత్రం పాముకాటుకు గురికావడంతో బుధవారం ఆమె పాఠశాల రీజినల్ కోఆర్డినేటర్ సంధ్యతో కలిసి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అపరిశుభ్రతను చూసి పాఠశాల నిర్వహణ తీరు, పర్యవేక్షణపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థి పాము కాటుకు గురైన ప్రదేశాన్ని, పాఠశాల విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్లను పరిశీలించారు. పరిస్థితులు దారుణంగా ఉండడంతో మీరు పాఠశాలకు రోజూ వస్తారా.. అంటూ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు .పాఠశాల ఆవరణ చుట్టూ ఉన్న చెట్లు, పొదలను తొలగించాలని సూచించడంతో సదరు భూములు మూసీ ప్రాజెక్టుకు చెందినవికావడంతో వాటి తొలగింపునకు మూసీ అధికారులు అంగీకరించడం లేదని కలెక్టర్‌కు అధికారులుతెలిపారు. పాఠశాలకు ఎంతమంది పారిశుధ్య కార్మికులు ఉన్నారని అడిగి తెలుసుకుని వారితో పనులు సక్రమంగా చేయించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులకు పంచాయతీ పారిశుధ్య కార్మికులను పంపించాలని బొప్పారం పంచాయతీ కార్యదర్శి హరీష్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఇదే సమయంలో ఎంపీవో అక్కడికి రాలేదని తెలుసుకుని అతడి వైఖరిపై మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పని చేయాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిశుభ్రతకే ప్రాధాన్యం

పెంపుడు శునకాలను పలువురు యజమానులు వదిలి వేస్తుండడంతో వీధి కుక్కల మాదిరిగానే బహిరంగ మల విసర్జన చేస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో యజమానులకు కూడా బాధ్యత ఉండాలని మునిసిపల్ శాఖ రూ. వెయ్యి జరిమానా వేసేలా ఉత్తర్వులు జారీ చేసింది. తమ ఇంటి పరిశుభ్రత కోసం యజమానులు పెంపుడు శునకాలను బహిరంగంగా వదిలి వేయడం సరైంది కాదని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం సరైందేనని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చే ఇలాంటి నిర్ణయాలు మంచివేనని పేర్కొంటున్నారు.

● భువనగిరిటౌన్, (ఆంధ్రజ్యోతి)

పెంపుడు శునకాలతో పరిసరాల అపరిశుభ్రత



పెంపుడు శునకాలను పలువురు యజమానులు స్వేచ్ఛగా వదిలి వేస్తుండడంతో వీధి కుక్కల మాదిరిగానే బహిరంగ మల విసర్జన చేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో ప్రజల నుంచి ఫిర్యాదులు పెరుగుతున్నాయి. ఈ మేరకు అమలులోకి వచ్చిన నిబంధనల ప్రకారం పెంపుడు కుక్కల బహిరంగ మల విసర్జనను యజమానులే తొలగించాలి. లేని పక్షంలో రూ. 1000 జరిమానా కట్టాల్సిందే.

● రజిత, హెల్త్ అసిస్టెంట్, భువనగిరి మునిసిపాలిటీ.

ప్రభుత్వ నిర్ణయం సరైనదే



పెంపుడు శునకాల పూర్తి బాధ్యత యజమానులదే. వీధి కుక్కల మాదిరిగా కరవకుండా, బహిరంగ మల విసర్జన చేయకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి. కాని శునకాలను పెంచడం స్టేటస్‌గా పరిగణిస్తూ వాటి అవసరాలను మాత్రం యజమానుల విస్మరిస్తున్నారు. ఇది సరి కాదు దీంతో బహిరంగ మల విసర్జన అపరిశుభ్రతకు కారణమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తెచ్చిన రూ.1000 జరిమానా సరైన నిర్ణయం.

● డాక్టర్ రాంచంద్రారెడ్డి, వెటర్నరీ వైద్యుడు, తుర్కపల్లి.

ప్రభుత్వ నిర్ణయాన్ని పాటిస్తా



శునకాలను పెంచడం కొన్నేళ్లుగా అలవాటుగా మారింది. అయితే వాటి అవసరాలను తీర్చేందుకు ప్రతిరోజూ రెండు పూటలా ఇంటి వెలుపలికి తీసుకు వెళ్తున్నాం. బహిరంగ మల విసర్జనతో కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో తాజాగా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రూ.1000 జరిమానా నిబంధనను గౌరవిస్తాం. ప్రభుత్వ నిర్ణయాన్ని పాటిస్తాం.

● కలకొండ రాజు, భువనగిరి.

నిబంధనను కఠినంగా అమలు చేయాలి



పెంపుడు శునకాల బహిరంగ మల విసర్జనపై రూ. 1000 జరిమానా నిబంధనను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలి. కుక్కలను పెంచేవారు వాటి బహిరంగ మల విసర్జనను ఎత్తి వేయడంపై కూడా శ్రద్ధ చూపాలి. తమ ఇంటి పరిశుభ్రత కోసం పెంపుడు శునకాలను బహిరంగంగా వదిలి వేయడం సరైంది కాదు. ప్రభుత్వ ఆలస్యంగా నైనా సరైన నిర్ణయం తీసుకుంది.

● కె. జ్యోతి, భువనగిరి.

కాల్వల మరమ్మతులకు మహర్దశ

● రూ.450 కోట్లు మంజూరుకు ప్రభుత్వం ఆమోదం ● త్వరలో ఏఎమ్మార్పీ కాల్వల్లో కంపచెట్ల తొలగింపు, లైనింగ్, సీసీ పనులు ప్రారంభం



ఏఎమ్మార్పీ ప్రధానకాల్వ ఇరువైపులా లైనింగ్ దెబ్బతిని ఏపుగా పెరిగిన కంపచెట్లు

దేవరకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంటనగరాలతో పాటు జిల్లాలోని 516 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎమ్మార్పీ) ప్రధాన కాల్వతో పాటు డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.రూ.450 కోట్లతో ఏఎమ్మార్పీ ప్రధానకాల్వ, డిస్ట్రిబ్యూటరీలు, లైనింగ్ పనులు, కంపచెట్ల తొలగింపు, నీరు వృథా కాకుండా మరమ్మతు పనులు త్వరలో చేపట్టనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులకు రూ.200కోట్ల వరకు ప్రతిపాదనలు పంపినా ప్రతిపాదనలకే పరిమితం కాగా, నిధులు మంజూరు చేయకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రోడ్ల భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జిల్లాలోని ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎస్ఎల్‌బీసీ, శ్రీశైలం సొరం గమార్గానికి రూ.4,638 కోట్లు, ఏఎమ్మార్పీ ప్రధానకాల్వ మరమ్మతులకు రూ.450 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో కాల్వల మరమ్మతులు పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలుపుతున్నారు.

త్వరలో ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులు ప్రారంభం

ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.450 కోట్లు కేటాయించింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం. నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

● సత్యనారాయణ, ఏఎమ్మార్పీ ఈఈ

కాల్వల్లో కంపచెట్లు ఏపుగా పెరిగి..

కొన్నేళ్లుగా ఏఎమ్మార్పీ ప్రధానకాల్వతో పాటు డిస్ట్రిబ్యూటరీల్లో ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి శిథిలావస్థకు చేరాయి. నాలుగుమోటార్ల ద్వారా 2,400 క్యూసెక్కుల నీరు పూర్తిస్థాయిలో విడుదల చేస్తే వృథా అయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో పాటు ఆయకట్టు చివరి వరకు నీరందని పరిస్థితి ఏర్పడింది. లీకేజీ రూపంలో నీరంతా వృథా అవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏఎమ్మార్పీ, ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాల్వ 132 కిలోమీటర్లు ఉండగా, 150 కిలోమీటర్ల మేర మేజర్ కాల్వలు ఉన్నాయి. ప్రాజెక్టు ప్రారంభం నుంచి సీసీ లైనింగ్ పనులు చేయకపోవడం, కంపచెట్లు తొలగించకపోవడంతో కాల్వలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు కాల్వల మరమ్మతులకు రూ.450 కోట్లు ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జనవరిలో పనులు ప్రారంభంకానున్నట్లు ఏఎమ్మార్పీ అధికారులు తెలిపారు.



కాల్వకు ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.125	200	230
సూర్యాపేట	రూ.120	180	200
నల్లగొండ	రూ.130	190	210

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	584.60
టీఎంసీలు	295.4155
ఎడమకాల్వకు నీటి విడుదల	5367
కుడికాల్వకు	10,438
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	24,00 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	31,115
అవుట్‌ఫ్లో	31,315 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	మూసివేత

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	43.25 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
అవుట్‌ఫ్లో	నిల్
ఎన్ని గేట్ల ద్వారా	0

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.56 అడుగులు
టీఎంసీలు	4.33
ఎన్ని గేట్ల ద్వారా	1 గేటు
ఇన్‌ఫ్లో	214.58 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	400.04 క్యూసెక్కులు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ధనుంజయ

గుర్రంపోడు, కొండమల్లేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైన్‌షాపుల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబరు 12న నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలకేంద్రంలోని ఆదిత్య వైన్స్‌లో అర్ధరాత్రి సుమారు రూ.10.80లక్షల నగదు చోరీకి గురైందని వైన్‌షాప్ యజమాని నర్సింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వేలిముద్రల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలంలోని కాపువీధిచెరువుకట్ట నివాసి బిస్తు రమేష్‌గా గుర్తించారు. అతడిని పట్టుకునేందుకు ఎస్పీ శరత్ చంద్రపవార్, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు పర్యవేక్షణలో నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సోమనర్సయ్య, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. నిందితుడు బిస్తు రమేష్ బుధవారం ఉదయం కొండమల్లేపల్లి బస్టాండ్‌లో తిరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ ధనుంజయ, గుర్రంపోడు ఎస్ఐ పసుపులేటి మధు, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, కిరణ్‌బాబు, దశరథ అతనిని అదుపులోకి తీసుకున్నారు. రమేష్‌ను విచారించగా రాష్ట్ర వ్యాప్తంగా 20 వైన్ షాపుల్లో దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నట్టు సీఐ తెలిపారు. అతని వద్ద రూ.1.85లక్షల నగదు స్వాధీనం చేసుకొని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న సిబ్బందిని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అభినందించి రివార్డులు అందజేశారు.

తెలంగాణకు కేసీఆర్ కలుపు మొక్కనే

● రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం

తుంగతుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు కేసీఆర్ కలుపు మొక్క అని, అలాంటి మొక్కను రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎదగనీయమని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. బుధవారం మండలంలోని అన్నారం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లలో ఒక్క దళితుడిని కూడా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థికసాయం ఇప్పించిన పాపానపోలేదని ఎద్దేవా చేశారు. గాదరి కిషోర్ కేసీఆర్ ఇంట్లో పెద్ద జీతగాడిగా పనిచేస్తూ రేంత్‌రెడ్డిపై అవాకులు చెవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. గతంలో ఇసుక దోపిడీ చేసిన అప్పటి ఎమ్మెల్యేకు చీర పంపిస్తున్నామని, బస్సు ఎక్కితే ఫ్రీ బస్సో లేదో తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతీ పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత కరెంటును ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దంగరి గోవర్ధన్, గ్రామ మాజీ సర్పంచ్ మిట్టగడుపుల అనుఖ్, మండల ఉపాధ్యక్షులు చింతకుంట్ల వెంకన్న, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తప్పట్ల శంకర్, నాయకులు దాసరి శ్రీను, మల్లేష్, అనిల్, నాగయ్య పాల్గొన్నారు.

తులసి వనంలో రేవంత్ గంజాయి మొక్క

● తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

తుంగతుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తులసి వనంలో గంజాయి మొక్క అని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరికిషోర్‌కుమార్ విమర్శించారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని అన్నారం గ్రామంలో బుధవారం సీఎస్ఐ చర్చిని ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ జాతిపిత, చావు నోట్లో తలదూర్చి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి సభలో తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో నెరవేరుస్తామని పది నెలలైనా వాటి అమలు ఊసే లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కృషితోనే తుంగతుర్తి నియోజకవర్గంలో లక్షా25వేల ఎకరాలకు సాగునీరు అంది, 12లక్షల టన్నుల ధాన్యం పండిందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు దళారులు, మిల్లర్లకు అమ్ముకుంటున్నారన్నారు. మూసీ ప్రక్షాళన ప్రారంభించింది మాజీ సీఎం కేసీఆర్ అని, మూసీ ప్రక్షాళన కోసం ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16వేల కోట్ల బడ్జెట్‌లో కేటాయించిందని గుర్తుచేశారు. మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, దొంగరి శ్రీనివాస్, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, రఘునందన్‌రెడ్డి, వెంకట్ దుర్గయ్య, దాసు, శ్రీను ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో నిత్య పూజలు బుధవారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొల్పిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీ దళాలతో సహస్రనార్చనలు నిర్వహించారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖ మండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండి జోడు సేవలు, సహస్రనార్చనలు నిర్వహిం చారు. పాతగుట్ట ఆల యంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.26,38,814ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా 618 జంటలు వ్రతాల్లో పాల్గొన్నాయి. మహిళా భక్తులు కార్తీక దీపారాధనలు చేశారు.

స్వామివారి సేవలో మంత్రి శ్రీధర్‌బాబు

ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముఖ మండపంలోని ధ్వజస్తంభానికి మొక్కులు చెల్లించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు మంత్రికి స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారు.

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పత్తి కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడి 14 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన నాంపల్లి మండలంలోని ఘట్లమల్లేపల్లిలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిపల్లి మండలం ఘనపురం గ్రామానికి చెందిన 17మంది కూలీలు పత్తి ఏరేందుకు ఆటోలో నాంపల్లి మండలం ఘట్లమల్లేపల్లికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో ఘట్లమల్లేపల్లి స్మశాన వాటిక వద్ద ఆటో అదుపుతప్పి పల్టీకొట్టింది. ఆటోలో ఉన్న దోసపాటి ముత్తమ్మ, దోసపాటి మంజుల తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. గనబోయిన వెంకటమ్మకు కాళ్లు విరగడంతో నల్లగొండకు తరలించారు. మిగిలిన 14 మందికి స్వల్పంగా గాయపడడంతో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాంపల్లి ఎస్ఐ దేవరకొండ ఆస్ప త్రికి వచ్చి వివరాలు సేకరించారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కేతేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాములలో జరిగింది. గ్రామానికి చెందిన మాచర్ల లింగమ్మ(65) ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. మంగళవారం సాయంత్రం తన ఇంట్లోని నల్లా నంపునకు గల విద్యుత్ మోటార్ ఆన్‌చేసి దుస్తులు ఉతుకుతుండగా విద్యుదాఘాతానికి గురైంది. ఇది గమనించిన ఇరుగు పొరుగు వారు ఆమెను చికిత్స నిమిత్తం నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లింగమ్మ మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం లింగమ్మ మృతదేహాన్ని స్వగ్రామం తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. లింగమ్మ భర్త, కుమారుడు గతంలో మృతిచెందగా ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం నకిరేకల్ ఆస్పత్రిలో లింగమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సెంట్రింగ్ బాక్సుల చోరీకి యత్నం

చౌటుప్పల్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ బాక్సుల చోరీకి యత్నించగా ఇద్దరు దొంగలు పట్టుబడ్డారు. మరొకరు పరారీలో ఉన్నారు. ఎస్ఐ యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇబ్రహీం, మహ్మద్ ఆసీఫ్‌అలీ, యాట బాబు బుధవారం తెల్లవారుజామున యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ రోడ్డులో కల్లెం పెంటారెడ్డికాలనీలో సెంట్రింగ్ బాక్సులు చోరీ చేసేందుకు యత్నించారు. ఇంటి యజమాని భాను ప్రకాశ్, సెంట్రింగ్ యజమాని ఊదరి నర్సింహ గమనించి 100కు ఫోన్ చేశారు. పోలీసులు సకాలంలో చేరుకుని ఇబ్రహీం, ఆసీఫ్ అలీను పట్టుకుని అరెస్టు చేశారు. యాట బాబు పరారీలో ఉన్నాడు. ఆటోను సీజ్ చేశారు.

ఇంజనీరింగ్ ఫీజు బకాయి రూ.160కోట్లు

● ఉమ్మడి జిల్లాలో 16 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ● ప్రభుత్వం టోకెన్లు ఇచ్చినా ఏడాదిగా ఎదురుచూపు ● డీటీవో కార్యాలయాలకు డబ్బు జమకాక అయోమయం

కోదాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాల ఫీజు రీయింబర్స్‌మెంట్ టోకెన్లు ఇచ్చి సంవత్సరం గడుస్తున్నా నిధుల విడుదలపై స్పష్టత రాకపోవడంతో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు మదనపడుతున్నాయి. మూడు సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారుతోందని ఆవేదన చెందుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు బకాయిల విడుదలకు టోకెన్లు జారీ చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. సెప్టెంబరు నెల చివరి నాటికి బకాయిలు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, నేటికీ బకాయిలు విడుదల కాకపోవడంతో అధ్యాపకులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, భవనాల ఈఎంఐలు చెల్లించలేదని, విద్యుత్ బిల్లులు కట్టలేకపోతున్నామని వారు పేర్కొంటున్నారు. అటెండర్లకు కూడా వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని నిర్వాహకులు ఆందోళనలో ఉన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒక్కో కళాశాలకు మూడు సంవత్సరాల నుంచి రూ.10కోట్ల నుంచి రూ.20కోట్ల బకాయిలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. వాటిలో ప్రతి కళాశాలకు రూ..5నుంచి రూ.10కోట్ల బకాయిలు విడుదల చేస్తే కొంతమేర ఇబ్బందులు తగ్గుతాయని చెబుతున్నారు.

దినదిన గండం..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 16ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. మూడేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద సుమారు రూ.160కోట్లు రావాల్సి ఉంది. వీటికి ఏంబీఏ, ఏంసీఏ, ఫార్మసీ, బీఎడ్, పీజీ బకాయిలు అదనం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి టీబీఆర్‌లో బిల్లు రిజిస్టర్ అయ్యాయి. బిల్ అయినట్లు టోకెన్ నెంబర్లు ఇచ్చారు. ప్రభుత్వం డీటీవో కార్యాలయాలకు డబ్బు చేయకపోవటంతో 10నెలల నుంచి టోకెన్లు పాస్ కావటంలేదు. ఫలితంగా డబ్బులు రావడం లేదని కళాశాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లా బంద్ బాట తప్పదా?

హైదరాబాద్‌లో ఉన్న కళాశాలల్లో సీట్ల సంఖ్య ఎక్కువ. వాటిలో 30శాతం మేనేజ్‌మెంట్ కోటా ఉంటుంది. ఫలితంగా కోటా కింద వచ్చే నిధులతో వారు కళాశాలలను నిర్వహించడం సులభం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కళాశాలలో మేనేజ్‌మెంట్ కింద చేరే విద్యార్థుల సంఖ్య తక్కువ. దీంతో ఆయా ప్రాంతాలలో నిర్వహిస్తున్న కళాశాలలు పూర్తిగా ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో నడపాల్సి ఉంటుంది. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు హైదరాబాద్‌లోని కళాశాలు మేనేజ్‌మెంట్ కింద వచ్చే నిధులు నుంచి కొంత ప్రభుత్వానికి సహాయం రూపంలో అందిస్తాయి. వాటిని పరిగనలోకి తీసుకొని అన్ని కళాశాలలకు ఒకేలా నిధులు వస్తున్నాయని గ్రామీణ, పట్టణ ప్రాంత కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే కళాశాలలు ఎలా నడపాలని నిర్వహకులు ప్రశ్నిస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోకపోతే డిగ్రీ కళాశాల మాదిరి, ఇంజనీరింగ్ కళాశాలలు బంద్‌బాట పట్టాల్సి వస్తోందని కళాశాల నిర్వహకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బడ్జెట్ విడుదల చేసి, ఇచ్చిన టోకెన్లకు డబ్బులు అందేలా చూడాలని కోరుతున్నారు.

టోకెన్లు ఇచ్చిన మేరకు బకాయిలు విడుదల చేయాలి

టోకెన్లు ఇచ్చిన మేరకు బకాయిలు విడుదల చేసి, అధ్యాపకులు వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు చెల్లించే విధంగా ప్రభుత్వం చూడాలి. మూడు సంవత్సరాల నుంచి బకాయిలు ఇవ్వకపోతే కళాశాలల నిర్వహణ ఏవిధంగా చేయాలో ప్రభుత్వమే చెప్పాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవటంతో ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి కళాశాలలను ఆదుకోవాలి.

● ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులు.

పథకాలు ప్రజలకు వివరించాలి

దేవరకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇందిరా ఫెలో సభ్యులు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఇందిర ఫెలో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మండలం మైనంపల్లి ఎంపీటీసీ కొర్ర గౌతమి శక్తిఅభియాన్ జ్ఞాపికను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ఇందిరా ఫెలో సభ్యులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేశారని, గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించిందని ఆయన గుర్తు చేసినట్లు కొర్ర గౌతమి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేయడం సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

అక్రమ అరెస్టులు అన్యాయం

తిరుమలగిరి(సాగర్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఫార్మా బాధితులకు అండగా నిలిస్తే పోలీసులు అక్రమంగా నిర్బంధించడం అన్యాయమని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ధరావత్ హరినాయక్ అన్నారు. లగచర్ల బాధితుల కోసం ఆందోళన చేపట్టనున్న ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా, మండల నాయకులను బుధవారం అరెస్ట్ చేశారు. సందర్భంగా ఆయన అరెస్ట్ అయిన వారిలో గిరిజన సంఘం నాయకులు లక్ష్మణ్‌నాయక్, రమేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పైసలిస్తేనే ఫైలు కదులుద్ది

- ఇవ్వకపోతే నెలల తరబడి తిరగాల్సిందే
- రాజకీయ అండతో వసూళ్లు చేస్తున్న ఓ అధికారి
- ఇది నల్లగొండ మునిసిపాలిటీలోని రెవెన్యూ విభాగంలో అవినీతి కహానీ

నల్లగొండ మునిసిపాలిటీ అవినీతి అక్రమాలకు పేరుగాంచిన తరుణంలో గత సంవత్సరం వరకు అధికారులు, సిబ్బంది లంచం అడగాలంటేనే వెన్నులో వణుకుపుట్టేది. ప్రస్తుతం మళ్లీ పాతరోజులే గుర్తొచ్చేలా అధికారులు, సిబ్బంది ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోలేని అధికారులు ఉండటం వల్లే కిందిస్థాయి సిబ్బంది యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. మునిసిపల్ కార్యాలయంలో ప్రధానంగా టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ, శానిటేషన్ వంటి విభాగాలు ఉన్నాయి. గుండెకాయ లాంటి ఈ రెవెన్యూ విభాగంలో మాత్రం అవినీతి అక్రమాలకు అడ్డగా మారిపోయింది.



– రామగిరి

రెవెన్యూ విభాగంలో ప్రధానంగా పట్టణంలోని వివిధ గృహాలకు సంబంధించిన ఆస్తి పన్ను వసూళ్లు, ఇంటి బదాలాయింపు (మ్యూటేషన్), కొత్త ఇళ్లకు అసిస్‌మెంట్ చేసి నెంబర్లు ఇవ్వడం వంటి విధులు ఉంటాయి. ఆస్తి పన్ను వసూళ్లు బిల్ కలెక్టర్లు చేస్తుండగా, పేరు మార్పిడి, అసిస్‌మెంట్ వంటి విధులు ఇరువురి అధికారులు పంచుకున్నట్లు తెలుస్తుంది. అయితే వీటిల్లో ఏ పనికి సంబంధించిన ఫైళ్లు కదలాలన్నా ఫైలును బట్టి రూ.5 నుంచి రూ.10వేల వరకు ఇవ్వాల్సిందే. కాదు కూడదు అంటే వంద రకాల కారణాలు చూపిస్తూ నెలల కొద్దీ చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఇందులో భాగంగా మ్యూటేషన్ విభాగానికి చెందిన ఓ అధికారి మాత్రం ఇంటి పేరును మార్చేందుకు బహిరంగంగానే వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఈ అధికారికి కౌన్సలర్ల అండ ఉందని తనకేమీ కాదని చెప్పుకుంటూ యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు పలువురు పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో ఓ వ్యక్తి ఇంటి పేరును మార్చేందుకు దరఖాస్తు చేసుకోగా మాకూ ఖర్చులు ఉంటాయి, రూ.5వేలు ఇవ్వాల్సిందేనని దరఖాస్తుదారునితో తెగేసి చెప్పినట్లు సమాచారం. వాస్తవానికి ఇంటి బదాలాయింపును 15 రోజుల్లోగా మార్చాలి. దరఖాస్తులో ఏమైనా లోపాలు ఉంటే సదరు దరఖాస్తుదారునికి సమాచారం ఇవ్వాలి. కాని ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సదరు దరఖాస్తుదారుని నెల రోజుల పాటు తిప్పించుకున్నట్లు తెలిసింది. దీనిని బట్టి చూస్తే లంచం ఇవ్వకపోవడం వల్లే నెల రోజుల పాటు తిప్పించుకున్నట్లు స్పష్టమవుతుంది. ఇక ఈ లంచం విషయం ఆ నోట ఈ నోట పొక్కి కమిషనర్ దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో కమిషనర్ ముందే సదరు దరఖాస్తుదారుడు ఈ అధికారిని మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఈ గొడవతో నివ్వెరబోయిన కమిషనర్ సదరు అధికారిని మందలించినట్లు తెలిసింది.

ఇదీలా ఉండగా ఇదే విభాగంలో ఓ అధికారి తాను నియమించుకున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ద్వారా నూతన గృహాలకు సంబంధించిన అసిస్‌మెంట్ చేయిస్తూ పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. ఈ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆన్‌లైన్ అకౌంట్ ద్వారా ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ అధికారి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అధికారి ఫోన్‌పే, గూగుల్‌పే లావాదేవాలపై విచారణ చేస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి రానున్నాయి.

అవినీతిపై విచారణ చేయిస్తా



కార్యాలయంలో ఇప్పటి వరకు అవినీతికి తావు లేదు. రెవెన్యూ విభాగంలో లంచాలు వసూళ్లు చేస్తున్నట్లు నా దృష్టికి అయితే రాలేదు. ఒకవేళ అలాంటిదేమైనా జరిగితే విచారణ చేయిస్తా. విచారణలో అవినీతి జరిగినట్లుగా రుజువైతే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్యలు ఉంటాయి.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

ఎస్సీ వర్గీకరణ బిల్లు చట్టసభల్లో ప్రవేశపెట్టాలి

నల్లగొండ రూరల్, రామగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టసభల్లో ప్రవేశపెట్టాలని మాదిగ సంఘాల మహాకూటమి జిల్లా అధ్యక్షుడు ధర్మపురం శ్రీనివాస్ మాదిగ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణతో మాదిగ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. హైదరాబాద్‌లోని బర్కత్‌పురలో గురువారం మాదిగ సంఘాల మహాకూటమి ఆధ్వర్యంలో నిర్వహించే ఆమరణ నిరాహార దీక్షను జయప్రదం చేయాలని కోరారు. మేధావులు విద్యార్థులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించి, పంపిణీ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు రాంప్రసాద్, గోసంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులు వరికొయ్యలను దహనం చేయవద్దు

గుర్రంపోడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటను కోసిన తర్వాత వరి కొయ్యలను తగలబెట్టవద్దని మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి అన్నారు. మండలంలోని చామలోనిబావి గ్రామంలోని రైతు వేదికలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల భూసారం తగ్గుతుందని, భూమికి మేలు చేసే కీటకాలు నశిస్తాయని తెలిపారు. వరి కొయ్యలను భూమిలో కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో గౌతమి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రామారావు



రామారావు

డిండి, నవంబరు 20(ఆంధ్ర జ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ డిండి మండల మండల అధ్యక్షుడిగా గండమల్ల రామారావును ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గండమల్ల రా మారావు, ప్రధానకార్యదర్శి నారోజు పవన్, ఉపాధ్యక్షులు కె.హరిలాల్, సుజాత, కోశాధికారిగా శ్రీనయ్య సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షు డు బక్క శ్రీనివాసచారి, జిల్లా సాంస్కృతిక కన్వీనర్ గిరి యాదయ్య పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించాలి

చిట్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ ఉచితంగా విద్య, వైద్యం అందించాలని బుధవారం ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మేడి రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అర్హులైన పేదవారి కి ఒక ఎకరం భూమి, నాలుగు గదుల ఇల్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, ప్రేమ్‌కుమార్, మహేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

సీపీఎం మండల కార్యదర్శిగా సైదులు

కట్టంగూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా మండలంలోని ఇస్మాయిల్‌పల్లి గ్రామానికి చెందిన పెంజర్ల సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇస్మాయిల్‌పల్లి గ్రామంలో ఈ నెల 19వ తేదీన జరిగిన మండల మహాసభలో మండల కార్యదర్శిగా మూడోసారి సైదులును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తానన్నారు. మండలంలో సీపీఎం బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని అన్నారు.

పాముకాటు బాధిత విద్యార్థికి ఎమ్మెల్యే పరామర్శ

కేతేపల్లి, నవంబరు20: పాముకాటుకు గురై నకిరేకల్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూసీ గురుకుల పాఠశాల విద్యార్థి బద్దం గణేష్‌ను ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో పాటు గణేష్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు చంద్రశేఖర్, అనితలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు బి.సుందర్, జితేందర్ ఉన్నారు.

చర్యలు తీసుకోవాలి

దామరచర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లి శివారులో రైతు దారగాని వెంకటేశ్వర్లుకు చెందిన భూమిని ఓ సిమెంట్ కంపెనీ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుందని, వెంటనే పరిశ్రమపై చర్యలు తీసుకొని రైతుకు న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. బుధవారం బీసీ కమిషన్ చైర్మన్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడపల్లి శివారులోని సర్వే నెం.483లో 1.24 ఎకరాల భూమిని వెంకటేశ్వర్లు సాగు చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. ఓసిమెంట్ యాజమాన్యం ఇటీవల యంత్రాలతో పంటను ధ్వంసం చేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఇప్పటికైనా కంపెనీపై చర్యలు తీసుకొని రైతుకు న్యాయం చేయాలని కోరారు.

సమగ్ర సర్వే 90శాతం పూర్తి

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పీఏపల్లి మండలంలోని 31 గ్రామ పంచాయతీ పరిధిలో గల కులగణన సర్వే పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, 90 శాతం సర్వే పూర్తి అయినట్లు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు.

టీడీపీకి పూర్వవైభవం తీసుకురావాలి : ఎల్వీ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్వీ యాదవ్

నల్లగొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేసి పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని నల్లగొండ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఎల్వీ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయకత్వంలో తెలంగాణలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేసే చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలంగాణలో పార్టీ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, నాయకులు సిద్ధిఖీ, చంద్రశేఖర్, నాగరాజు, క్రాంతికుమార్, స్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా: వీరేశం



కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద రూ.10లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్, రూ.5లక్షలతో 5వ వార్డులో వేయనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన కనీస వసతుల కల్పన కోసం తన ఎమ్మెల్యే కోటా నిధులను వెచ్చిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, జెరిపోతుల భరత్, ఐతరాజు యాదయ్య, ఇడుకుళ్ల బిక్షమయ్య, రేగట్టె నర్సిరెడ్డి, లింగారెడ్డి, సత్తి, సమద్, గురుస్వాములు బెల్లి వెంకన్న, యాదగిరి, శ్రీను, పశుపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్ : నాగం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి

రామగిరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారం చేజిక్కించుకున్న సీఎం రేవంత్‌రెడ్డిని రాజకీయంగా బొంద పెట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో సమైక్యాంధ్ర కోసం పోరాడిన రేవంత్‌రెడ్డి నేడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి నల్లగొండ జిల్లా లో చేసే పర్యటనను బీజేపీ శ్రేణులు అడ్డుకొని తరిమికొడతామని ఆయన హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన వల్లే 13 వందల మంది ఆత్మబలిదానాలు చేసుకోవాల్సి వచ్చిందన్నారు. ప్రధాని మోదీ, కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చే స్తే ఉరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య, మిర్యాల వెంకటేశం, రావెళ్ల కాశమ్మ, వంగూరి రాఖీ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అం బటి సోమన్న అన్నారు. పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సంయుక్త కార్మిక సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఈ నెల 26వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మోహినుద్దీన్, వైస్ ప్రెసిడెంట్ కె.నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాశం నరేష్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యూరో సర్జన్ సాయిజ్ కృష్ణన్

మిర్యాలగూడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చని యశోద ఆసుపత్రి న్యూరో సర్జన్ సాయిజ్ కృష్ణన్ అన్నారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన 'రోడ్డు ప్రమాదాలు- నివారణ, చికిత్సలు'పై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీలర్స్ వాహన చోదకులు సీట్ బెల్ట్‌ను ధరించాలని అన్నారు. దీనివల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రమాద తీవ్రత తగ్గుతుందని అన్నారు. ఇటీవల మిర్యాలగూడ మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న బానావత్ నితిన్ సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల తీవ్ర గాయాలపాలైనట్లు తెలిపారు. అత్యంత ప్రమాదకర పరిస్థితితుల్లో పోలిట్రామా క్రిటికల్ కేర్ ఆపరేషన్లు నిర్వహించి ప్రాణాపాయం నుంచి రక్షించడం జరిగిందన్నారు. 45రోజుల తర్వాత రోగి పూర్తిగా కోలుకున్నారన్నారని పేర్కొన్నారు. నిబంధనలు పాటించి అపాయాల నుంచి రక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రఫుల్, డాక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, మేనేజర్ చిదుర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆస్పత్రి అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే బీఎల్ఆర్



కంటి ఆస్పత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీకేవీ రంగాచార్యులు, రంగనాయకమ్మ లయన్స్‌క్లబ్ కంటి ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం లయన్స్‌క్లబ్ కంటి ఆస్పత్రిని ఆయన సతీమణి మాధవితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్సలు చేసుకున్న రోగులకు కంటి అద్దాలు పంపిణీ చేసి మాట్లాడారు. సర్వేంద్రియా నాం.. నయనం ప్రధానమని, చూపులేని వారికి చూపునిచ్చే ఆస్పత్రి దేవాలయంతో సమానమన్నారు. సువిశాలమైన ఆస్పత్రి ప్రాంగణంలో వైద్య సేవలు పెంచాలని, కంటితో పాటు దీర్ఘకాలిక రోగాలకు చికిత్స, అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ ము క్కపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ జాడి రాజు, క్లబ్ అధ్యక్షుడు లింగయ్య, గుడిపాటి నవీన్, వరుణ్, మల్లారెడ్డి, శ్రీనివాస్, క్రాంతి, నాయుడు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌండ్‌తో పాటు పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మిర్యాలగూడ టౌన్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప, ఆంజనేయ, దేవీ మాలధారణ చేసిన భక్తులకు మండల కాలం పాటు నిత్యాన్నదానం చేయడం పుణ్యకార్యమన్నారు. మహోత్తర కార్యక్రమానికి సహకారం అందిస్తున్న గుడిపాటి నవీన్ బ్రదర్స్, బండారి కుశలయ్యలను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ ముక్కపాటి వెంకటేశ్వరరావు, నర్సిరెడ్డి, స్కైలాబ్, వేణు, నారాయణ పాల్గొన్నారు.

ఏం చేశారని విజయోత్సవ సభలు : చిరుమర్తి

నకిరేకల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలల కాలంలో తెలంగాణకు ఏం చేసిందని విజయోత్సవ సభలు నిర్వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. నకిరేకల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని రేవంత్‌రెడ్డి పాలనను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టడం మాని హామీల అమలుపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, కౌన్సిలర్ పల్లె విజయ్, నాయకులు మాద నగేష్, గొర్ల వీరయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, పెండెం సదానందం, వెంకన్న, లింగారెడ్డి, గణేష్, దైద పరమేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

24న టీఎస్‌యూటీఎఫ్ మహాసభ

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 24వ తేదీన టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు మాధవరం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎల్.లోకనాథం తెలిపారు. పాఠశాలలో బుధవారం భోజన విరామ సమయంలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమగ్రశిక్షలో భాగంగా పనిచేస్తున్న కస్తూర్బా ఉపాధ్యాయులకు, సీఆర్పీలకు మినిమం టైంస్కేల్ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల అధ్యక్షులు రాగి రాకేష్‌కుమార్, నాయకులు కడేరు రవికుమార్, కిషోర్, మహ్మద్ రఫీ, నల్ల చక్రపాణి, మధు, గంగాధర్, శౌకత్ అలీ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

తిరుమలగిరి(సాగర్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి అన్నారు. మండలంలోని బోయగూడెం, రాజవరం గ్రామాల్లో బుధవారం కొత్తపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. మిల్లర్లు సైతం రైతులకు మద్దతు ధర అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రిక్కల మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు సత్యం, దేశ బాలునాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బి.వి.రమణరాజు, నాయకులు నాగెండ్ల వెంకట్‌రెడ్డి, నెమలి కృష్ణారెడ్డి, పోలెపల్లి అంజి, బిక్షనాయక్, శంకర్‌నాయక్, కృష్ణప్రసాద్, లింగారెడ్డి, లింగారెడ్డి, చల్లా కోటేష్, సాయిరాం, కోటేష్‌యాదవ్, సత్యం, దుర్గారెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మునుగోడురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చెరుకూరి ముత్తమ్మ, మేక బాసిరెడ్డికి మంజూరైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొలగోని సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, నాయకులు బొందు రవి, స్వామి, యాబీష్‌రెడ్డి, మల్లేష్, యాదయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లయ్య

నిడమనూరు, హాలియా, పెద్దవూర, నల్లగొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య కోరారు. బుధవారం నిడమనూరు, హాలియా, పెద్దవూర మండలాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్గీకరణ కోసం మాదిగలు 30 ఏళ్లుగా చేస్తున్న సుదీర్ఘ పోరాటం న్యాయమైందని, దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. వర్గీకరణకు ప్రభుత్వాలు కూడా సహకరించాలని డిమాండ్ చేశారు. సమ్మేళనానికి మాదిగ విద్యార్థులు, ఉద్యోగులు, మేథావులు, కవులు, కళాకారులు, నిరుద్యోగ యువత, మాదిగ ఉపకులాల నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయా సమావేశాల్లో చినశ్రీరాములు, మాచర్ల సైదులు, బకరం శ్రీనివాస్, పోలే రవి, బొజ్జ చిన్నామాదిగ, బొజ్జ పుల్లయ్య, మోసాల శ్రీను, ప్రభాకర్, మైసయ్య, మల్లయ్య హాలియాలో నకిరేకంటి సైదులు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నశ్రీరాములు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మాచర్ల సైదులు, సోమశేఖర్, బందిలి పెద్దసైదులు, విజయ్, సైదులు, వెంకటయ్య పెద్దవూరలో నిర్వహించిన సమావేశంలో పులిమాల కృష్ణారావు, నాగార్జునమాదిగ, సైదులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

- నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొర్ర సుధాకర్, దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. సమ్మేళనానికి అన్ని రంగాలకు చెందిన మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బకరం వెంకన్న, చింత సైదులు, రొమ్ముల నాగయ్య, కొప్పోల్ విమలమ్మ, అశోక్, వెంకన్న, మనిమద్దె పద్మావతి, చింత రామలింగయ్య, శ్రీను, మాదిగ జేఏసీ చైర్మన్ కత్తుల జగన్‌కుమార్, తులసీదాసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

మునుగోడురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మునుగోడు మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చెరుకూరి ముత్తమ్మ, మేక బాసిరెడ్డికి మంజూరైన చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొలగోని సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, నాయకులు బొందు రవి, స్వామి, యాబీష్ రెడ్డి, మల్లేష్, యాదయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ కోరారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపేలా కమ్యూనిస్టు పార్టీ ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తోందని అన్నారు. డిసెంబరు 2,3,4, తేదీల్లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, రాంమూర్తి, రమేష్, రామకృష్ణ, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

డీఏపీకి ప్రత్యామ్నాయ ఎరువులు వాడాలి

కొండమల్లేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటలో డీఏపీ ఎరువులకు ప్రత్యామ్నాయంగా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులను వాడాలని ఏవో జానకిరాం సూచించారు. బుధవారం ఆయన స్థానికంగా రైతులతో మాట్లాడుతూ ఫాస్ఫేట్(ఎస్ఎస్పీ), యూరియా, పొటాష్(ఎంఓపీ) వంటివి వాడుకోవాలని ఆయన సూచించారు.

వృద్ధురాలిని మోసగించి రూ.2 కోట్ల ఆస్తి కొట్టేసి

(5పేజీ తరువాయి)

బి.సాయిప్రశాంత్ విచారణ చేపట్టారు. వృద్ధురాలు, హుస్సేన్ మధ్య 33గుంటల భూమి విక్రయానికి సంబంధించి మాత్రమే అగ్రిమెంట్ ఉన్న విషయాన్ని పోలీసులు గుర్తించారు. నల్లగొండ పట్టణంలోని డీటీపీ సెంటర్ నిర్వాహకుడిని విచారించి, ఖాళీ పత్రాలలో ఏ సమాచారం నింపాలో వాట్సప్‌లో పంపిన మరో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే ఉద్యోగి పంపిన మెసేజ్‌ను ట్రేస్ చేసి వృద్ధురాలిని మోసం చేసిన విషయాన్ని పోలీసులు నిర్ధారించినట్లు తెలిసింది. ఆమె ఫిర్యాదు మేరకు హుస్సేన్, అతడి ఇద్దరు కుమారులపై పోలీసులు ఛీటింగ్ కేసు నమోదు చేశారు. రిజిస్ట్రేషన్ వివరాలివ్వాల్సిందిగా తహసీల్దార్‌కు లేఖరాశారు. ఆ వివరాలు వచ్చాక పూర్తిస్థాయి విచారణ నిర్వహిస్తామని ఎస్ఐ బి.సాయిప్రశాంత్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అదేవిధంగా వృద్ధురాలు తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసింది.

అయితే ఆమె ఇష్టపూర్వకంగా ఆస్తిని విక్రయించిందని, మొత్తం సొమ్ము చెల్లించాకే రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, తమపై తప్పుడు ఫిర్యాదులు చేసిందని హుస్సేన్, అతడి కుమారులు పేర్కొంటున్నారు.